క్లుప్తంగా

పోషకాహారం తీసుకోవాలి

పెద్దతిప్పసముద్రం : గర్భిణులు, బాలింతలు పోషక పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని బి.కొత్తకోట ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యమ్మ, సూపర్‌వైజర్ నాగరత్నమ్మ సూచించారు. బుధవారం మండలంలోని బూర్లపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ మహమ్మద్ యస్దానీ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు అయ్యేలా చూడాలని ఆశా వర్కర్లకు హితబోధ చేసారు. అనంతరం తల్లీ బిడ్డల ఆరోగ్యం,ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు.

దివ్యాంగ పింఛన్ల పునఃపరిశీలన

పీలేరు రూరల్ : మండలంలో దివ్యాంగ పింఛన్లపై పునఃపరిశీలన చేస్తున్నట్లు ఎంపీడీఓ జి.శివశంకర్ అన్నారు. బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో పింఛన్ల పునఃపరిశీలన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 619 మంది పెన్షన్లు పొందుతున్నారని, రాయచోటికి చెందిన వైద్యులు డాక్టర్ షేక్ రాజాఅహ్మద్‌చే పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. రోజుకు 50 మంది చొప్పున పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు వినాయకం ప్రకాశం, భారతి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేటుకు మరమ్మతు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు ప్రభుత్వ పాఠశాలలో మతిన్ (6) అనే విద్యార్థిపై మంగళవారం స్కూల్ ఇనుప గేటు పడటంతో తలకు బలమైన గాయం అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓ నారాయణ బుధవారం సదరు పాఠశాలను సందర్శించి జరిగిన ఘటనపై హెచ్‌ఎం రమణప్పతో పాటు గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రమాదకరంగా ఉన్న గేటుకు మరమ్మతులు చేయించడంతో ఇటు పిల్లలతో పాటు వారి కన్నవాళ్లు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

మదనపల్లె సిటీ : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వన్‌డిపో లో గేట్ మీటింగ్ నిర్వహించారు. సిబ్బంది సంతోషంగా, ఇష్టపడి పనిచేయాలని కోరారు. ఇప్పటి వరకు డిపో రీజియన్ పరిధిలో మంచి ఆదాయంతో పాటు ఫలితాలు వచ్చాయన్నారు. సిబ్బంది సమష్టి కృషితోనే డిపోకు ఆదాయం బాగా వస్తున్నట్లు తెలిపారు. గ్యారేజ్‌లో ఎలక్ట్రీషియన్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం వచ్చినందుకు అభినందించారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయం తనిఖీ

మదనపల్లె సిటీ : స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయాన్ని బుధవారం జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్ తనిఖీ చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఆలయ విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఆలయాన్ని దేవదాయశాఖ స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఆలయాన్ని దేవదాయశాఖ అధికారులు పరిశీలించారు. ఆయన వెంట దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ శశికుమార్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయండి



నిరసన చేస్తున్న కార్మికులు

ములకలచెరువు : కార్మికులు, రైతాంగం, ప్రజలకు నష్టం కలిగేలా కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ తంబళ్లపల్లె నియోజకవర్గ కార్యదర్శి సలీంబాషా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలో కార్మికులు, రైతు సంఘ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. లేబర్ కోడ్‌లు అమలు జరిగితే కార్మికులు నష్టపోతారని, ఈ కోడ్‌లను వెంటనే రద్దు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అంజనప్ప, మహబూబ్‌బాషా, నారాయణస్వామి, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

ఎంఈఓకు సన్మానం

బి.కొత్తకోట : మండల ఎంఈవో ఆర్.రెడ్డిశేఖర్‌ను బుధవారం ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు ఘనంగా సన్మానం చేశారు. గణతంత్ర దినోత్సవాన ఉత్తమ ఎంఈవోగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. దీన్ని పురస్కరించుకుని గట్టు జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం లలితకుమారి, ఉపాధ్యాయులు జాఫర్‌వలీ, రెడ్డిగురుప్రసాద్, భాస్కర్, నాగరాజు, గీతాంజలి శాలువ, పూలమాలతో సత్కరించారు.

మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

బి.కొత్తకోట : మండలంలోని కోటావూరు గ్రామంలో మంగళవారం రాత్రి కేబుల్ దొంగలు మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారు. శీతివారిపల్లిలో రెండు, ఎర్రమద్దువారిపల్లిలో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో రాగి వైరును తీసుకెళ్లారు. బుధవారం ఉదయం బోర్ల వద్దకు వెళ్లిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై ఉండటం గుర్తించారు. డిస్కం ఏఈ గిరిబాబుకు తెలియజేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు దాటాలంటే సాహసం చేయాల్సిందే

- గజిబిజి క్రాసింగ్‌లతో ఇబ్బందులు
- బైపాస్‌రోడ్డులో నిత్యం ప్రమాదాలు


ప్రమాదాలకు నిలయంగా మారిన బైపాస్‌రోడ్డు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం కదిరిరోడ్డులో బైపాస్‌రోడ్డు వద్ద క్రాసింగ్‌లు గిజిబిజిగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టారు. అమ్మచెరువు మిట్ట కూడలిలో రోడ్డు దాటాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. ఇక్కడ ఎన్‌హెచ్ అధికారులు క్రాసింగ్ చేయడానికి ఏర్పాట్లు చేసినా గజిబిజిగా ఉంది. ఎక్కడ క్రాసింగ్ చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఫోర్‌లైన్‌రోడ్డుకు అటువైపు అమ్మచెరువుమిట్ట, అనపగుట్ట, శ్రీవారినగర్, చంద్రకాలనీ, మంజునాథ కాలనీ,వాల్మీకినగర్, జహానగర్, గురుకుల బాలికల పాఠశాల, బీకె పల్లె కాలనీలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో నివాసమున్న కాలనీ వాసులు రోడ్డు క్రాసింగ్ చేయడానికి ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో రోడ్డుదాటుతున్న సమయంలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు ప్రభుత్వం చేయూత అందించాలి


మాట్లాడుతున్న స్వేచ్ఛ వ్యవస్థాపకురాలు యశోధర

మదనపల్లె : రైతులకు... ప్రభుత్వం, సమాజం చేయూతను అందించి తిరిగి పురాతన సంప్రదాయ పద్ధతుల్లో వ్యవసాయాన్ని చేపడితే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు దేశానికి విలువైన సంపద లభిస్తుందని స్వేచ్ఛ ఎన్‌జీఓ యశోధర అన్నారు. బుధవారం మదనపల్లె బైపాస్ రోడ్డులోని గోపాలవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులను ఆదుకొంటేనే దేశానికి సంపద, ఆరోగ్యమని అన్నారు. వ్యవసాయంలో యాంత్రిక విధానాలతో ప్రజలు తీవ్రమైన అనారోగ్యం బారిన పడుతున్నట్లు తన 9 ఏళ్ల పరిశోధనలో గుర్తించానన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ వల్ల అత్యధిక శాతం ప్రజల్లో డయాబెటిస్ వస్తోందన్నారు. పూర్వీకులు కుప్ప వేసిన వరి ధాన్యాన్ని వండుకుని ఆహారంగా భుజించేవారని, ఏరోజు వారు క్యాన్సర్ లాంటి జబ్బుల బారిన పడలేదని, డయాబెటిస్ వారి దరి కూడా చేరలేదని గుర్తు చేశారు. పంట పండిన తర్వాత ఆ పంటను తీయడంలోను, వినియోగించే విధానంలో ధాన్యం పాట్లు కోల్పోవడం వలన గ్లూకోజ్ స్థాయి పెరిగి డయాబెటిస్ వస్తోందన్నారు. అంతే కాకుండా భూమి పోషకాలు కోల్పోవడం, దిగుబడి కోసం రసాయన ఎరువులు వినియోగం పెరిగి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు కనుమరుగు కావటం కూడా కారణమన్నారు. ముఖ్యంగా వరి పంట విషయంలో పంట కోసిన తర్వాత కుప్పవేసి వారం రోజులు ముగ్గిన అనంతరం పంటనూర్పిడి చేస్తే గ్లూకోస్ స్థాయి తగ్గి, వాటిని తీసుకున్న వారి ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని వివరించారు. పురాతన సంప్రదాయ పద్ధతులలో ఆహార నియమాలను వ్యవసాయ పద్ధతులను ఆచరిస్తే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు సంపద సమకూరుతుందని చెప్పారు. దేశానికి రైతులు, పశువులు విలువైన సంపదని ప్రతి ఒక్కరూ ముఖ్యంగా సేంద్రీయ ఉత్పత్తులైన కూరగాయలను, ఆకుకూరలను వినియోగించడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నారదరెడ్డి, బండి ఆనంద్, గోపాలవనం నిర్వాహకులు రాజశేఖర్ లు పాల్గొన్నారు.

రామసముద్రం ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా తిప్పేస్వామి

రామసముద్రం : రామసముద్రం మండలం ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా నిమ్మనపల్లె ఎస్‌ఐ తిప్పేస్వామి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకటసుబ్బయ్య, రూరల్ సీఐ రమేష్‌లు ఏసీబీకి పట్టుబడ్డారు. దీంతో ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య స్థానంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ఎస్‌ఐ తిప్పేస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

ఆర్ఓబీ సిబ్బందితో వాగ్వాదం

పీలేరు : పీలేరు పట్టణంలో ఆర్‌వోబీ నిర్మాణంతో దుమ్ము ధూళితో భరించలేకున్నామని స్థానికులు ఆర్‌వోబీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. బుధవారం పలువురు సిబ్బందితో వాగ్వాదానికి దిగి దుమ్ములేకుండా పనులు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దుమ్ముతో పలువురు అస్వస్థతకు గురవుతున్నారన్నారు. ముందస్తు చర్యలు తీసుకోకుండా, తాత్కాలిక రోడ్డు వేయకుండా ఆర్‌వోబీ పని చేయడంలో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. రోజులో కనీసం మూడుసార్లు నీరు పట్టడం లేదన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి సమస్య తీర్చాలని డిమాండ్ చేశారు.

కుష్టు నివారణకు ఉచిత చికిత్స, మందులు

కలకడ : కుష్టు నివారణకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత చికిత్స, మందులు ఇవ్వనున్నట్లు ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కదిరాయచెర్వు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెండు వారాలపాటు ఇంటింటి సర్వే చేయించి అనుమాన కేసులును పరిశీలించి పూర్తి ఉచితంగా చికిత్స చేయడం జరుగుతుందన్నారు. అనంతరం 104 వైద్యసేవలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఈఓ జయరామయ్య, కుష్టువ్యాధినివారణ సిబ్బంది రియాజ్, నాగిరెడ్డి,ఏఎన్‌యంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

400 మందికి కంటిపొర పరీక్షలు

కేవీపల్లె : మండలంలోని మిన్నంరెడ్డిగారిపల్లెలో ఈ నెల 2వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో మొత్తం 400 మందికి కంటి పొర పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు వంగిమళ్ల శ్రీనివాసులురెడ్డి, వంగిమళ్ల నరసారెడ్డి తెలిపారు. బుధవారం చెన్నై శంకర్‌నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి పొర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజుల్లో కంటి పొర పరీక్షలు చేయడం జరిగిందని, ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఇక్కడే ప్రత్యేక బస్సుల్లో ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పొత్తపు సతీష్‌రెడ్డి, శంకర్‌నేత్రాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కలికిరి : మెరుగైన వైద్యసేవలు అందించాలని నేషనల్ హెల్త్ మిషన్ సెంట్రల్ టీం డాక్టర్ పరీవ్రన్ సూల్తానా అన్నారు. బుధవారం కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ పథకం కింద అమలవుతున్న ఎన్‌సీడీ, తల్లీబిడ్డ సంరక్ష, కుటుంబ పథకం తదితర పథకాలు అమలుపై ఆరాతీశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పవన్‌కుమార్, డీపీవో డాక్టర్ వెంకటేష్, డాక్టర్ ఆశాలత, డాక్టర్ అన్వేష్, డాక్టర్ సిమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్, సీటు బెల్టుతో ప్రాణాలకు రక్ష

డీటీఓ ప్రసాద్


రోడ్డు భద్రతా ర్యాలీలో రవాణాశాఖ అధికారులు

మదనపల్లె : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించి ప్రయాణం చేయాలని, తద్వారా ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలకు రక్షణగా ఉంటుందని జిల్లా రవాణాశాఖ అధికారి(డీటీఓ) ప్రసాద్ తెలిపారు. జాతీయరహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం పట్టణంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుంచి వెయ్యి మందికి పైగా వచ్చిన విద్యార్థులతో... జెడ్పీహైస్కూల్, ఆర్టీసీబస్టాండ్, అంబేడ్కర్ సర్కిల్, సీటీఎం రోడ్డు మీదుగా టౌన్‌బ్యాంక్ సర్కిల్, అవెన్యూరోడ్డు, బెంగళూరు బస్టాండుకు చేరుకుని మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీఓ ప్రసాద్ మాట్లాడుతూ...వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణహాని ఉండదన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ఎవరైనా మైనర్ వాహనంతో రోడ్డెక్కితే తల్లిదండ్రులపై కేసు నమోదుచేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపితే ఆరునెలలు జైలుశిక్ష ఉంటుందని హెచ్చరించారు. అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తోనే ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్టీఓ అశోక్‌ప్రతాప్‌రావు, ఎంవీఐలు దినేష్‌చంద్ర, శివలింగయ్య, శ్రీహరి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకురాలు మోహనవల్లి, ట్రాఫిక్ సీఐ మోహన్, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు


కల్వర్టు పనులు తనిఖీ చేస్తున్న అధికారులు

కలకడ : మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఏపీడీ చెన్నకేశవులు, ఏఈ రూప్‌సాగర్ ఆదేశించారు. బుధవారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీలో కల్వర్టు పనులు, కాటిల్‌షెడ్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిమెంట్‌కు నీరే ప్రాణమని, ప్రతి సిమెంట్‌పనిలో నీరు తేమ అధికంగా ఉండాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనిలో నాణ్యత ఉన్నప్పుడే ఎక్కువ కాలం మన్నిక వస్తుందని గుర్తు చేశారు. ఉపాధిహామీ పథకంలో పనులు చేసే కూలీలు రానున్న వేసవి కాలంలో ఉదయం, సాయంత్రం సమయంలో పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ అసిస్టెంట్ సమర, తదితరులు పాల్గొన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్

మదనపల్లె : 104, ఎన్టీఆర్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవల కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. బుధవారం మదనపల్లి మండలం పరిధిలో 104 వైద్య సేవలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ లోకవర్ధన్ మాట్లాడుతూ 104 సేవల ద్వారా ప్రభుత్వం దీర్ఘకాలిక రోగులకు నెలకు సరిపడా మందులు ఇస్తున్నారన్నారు.మినీ ప్రాథమిక సంచార ఆరోగ్య కేంద్రంగా 104 వాహనం సేవలు అందిస్తోందన్నారు. అన్నిరకాల మందులు ఈ. సి. జి. సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. తనిఖీలో భాగంగా నిర్దేశిత చెక్ లిస్ట్ ప్రకారం 105 రకాల మందులు,14 రకాల పరీక్షలు అన్ని ఉన్నాయా, వాటిని వైద్యులు సిబ్బంది ఉపయోగిస్తున్నారా, వాహనం కండీషన్‌లో ఉందా అనే విషయాలపై నివేదిక ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందన్నారు. గళ్ళ పరీక్షలు నమూనాలు సేకరించి,టి. బి. వ్యాధి నిర్ధారణ చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజులలో మరిన్ని వైద్య సేవలు, రక్తపరీక్షలు, మూత్ర పరీక్షలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం 108అంబులెన్సు వాహనం తనిఖీ చేశారు. కార్యక్రమం లో 104మరియు 108 సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి నివాళి

మదనపల్లె : మండలంలోని కోళ్లబైలు పంచాయతీ జగన్ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సయ్యద్ మహమ్మద్ ఇలియాజ్(అబ్బు) బుధవారం ఆకస్మికంగా మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, జగన్ కాలనీకి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తగా అబ్బు సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన మృతికి సంతాపసూచకంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సలీం, పూజారి చరణ్, జగన్ కాలనీ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సంతాపం

గుర్రంకొండ : మండలంలోని శెట్టివారిపల్లె గ్రామానికి చెందినవ వైఎస్సార్‌సీపీ నాయకులు కె. రవికుమార్ మృతి పట్ల పీలేరు మాజీ ఎమ్మెల్యే సంతాపం ప్రకటించారు. రవికుమార్ గత మంగళవారం తిరుపతి సమీపంలో రైలు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం ఆయన స్వగ్రామమైన శెట్టివారిపల్లెకి ఎమ్మెల్యే చేరుకొని రవికుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీ రమణ, చంద్రశేఖర్, అప్పల్ల, నాయకులు ఎస్వీరమణ, రాజశేఖర్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

16, 17న ఏఐటీయూసీ జిల్లా ప్రథమ మహాసభలు

మదనపల్లె : ఏఐటీయూసీ అన్నమయ్యజిల్లా ప్రథమ మహాసభలు ఫిబ్రవరి 16, 17 తేదీల్లో రైల్వేకోడూరులో నిర్వహించనున్నట్లు పట్టణ కార్యదర్శి తిరుమల తెలిపారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు తోపుకృష్ణప్ప చేతులమీదుగా జిల్లా ప్రథమ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ నిరంతరం పోరుబాటన నడుస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ముబారక్, మున్సిపల్ కార్మికులు నాగరాజు, పృథ్వీ, వంశీ ఓబులేష్, శీను, గంగులప్ప వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ అలంకారంలో జనార్ధనస్వామి



రామసముద్రం : శ్రీ లక్ష్మీ జనార్ధనస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీ కృష్ణ అవతారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి భట్టర్, కులశేఖర్ భట్టర్‌లు భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

హంస వాహనంపై శ్రీవారు


హంస వాహనంపై అమ్మవారు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో మూడు రోజులుగా స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. టీటీడీ ఆగమ సలహాదారు శ్రీనివాసచార్యులు,అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్‌బాబు, ధనుష్,క్రిష్ణమూర్తి బుధవారం స్వామి అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం శేష వాహనంపై శ్రీదేవి,భూదేవి సమేత వెంకటరమణస్వామిని ఆకర్షణీయంగా అలంకరించారు. రాత్రి హంస వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ గోపినాథ్, ఇన్స్‌పెక్టర్ దుష్యంత్‌కుమార్, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ బోర్డు మీటింగ్‌కు వ్యతిరేకం కాదు

సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా


మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్ : గ్రామ పంచాయతీ బోర్డు మీటింగ్‌కు తాము వ్యతిరేకం కాదని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత పంచాయతీ ఈవో విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులు ఖర్చు పెట్టిన వివరాలు, భవన నిర్మాణ అనుమతులు, లైసెన్సులు, తీర్మానాలు, క్యాష్ పుస్తకము, బిల్లులు, డీజిల్ బిల్లులు, శానిటేషన్ బిల్లులు, ఎంబుక్‌లు, ప్రతి రోజూ వసూలు చేసే చలానాల నకలు తదితర వివరాలు తమకు తెలపలేదని చెప్పారు. అలాగే కార్మికులకు ఈపీఎఫ్, ఆయిల్, సోపులు, బట్టలు ఎందుకు చెల్లించలేదో తెలియజేయాలని ఈవోను కోరినా స్పందన లేదన్నారు. గత బోర్డు మీటింగ్‌లో తీర్మానాలకు సమాధానం లేదని తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు శ్రీనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, కాలేషా, సచిన్, రమణ, సాంబశివారెడ్డి, అబీద్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీఓ అమరనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం : జియోట్యా గింగ్, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ లాంటి ప్రభుత్వం ఆదేశించే ఎలాంటి సర్వేనైనా పారదర్శకంగా చేపట్టి అమలు చేయాల్సిందేనని మదనపల్లి డివిజన్ డీఎల్‌డీవో అమరనాథ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌తో కలసి మండలంలోని కందుకూరు, కాట్నగల్లు, పీటీఎం సచివాలయాలను తనిఖీ చేసి సిబ్బందికి విధి, విధానాలపై అవగాహన కల్పించారు. ఇదిలా ఉండగా మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా దాదాపు సగం మంది దాకా పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో లేరు. ప్రజలకు జనన, మరణ ధ్రువ పత్రాల అవసరంతో పాటు తాగునీటి సమస్య, వీధి దీపాలు, మురికి కాలువల శుభ్రం లాంటి సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆర్టీసీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ఎన్‌ఎంయు జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి


నూతన కార్యవర్గంతో ఎన్‌ఎంయు నాయకులు

మదనపల్లె సిటీ : ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎన్‌ఎంయు జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి అన్నారు. స్థానిక దేశాయ్ ఫంక్షన్‌హాలులో బుధవారం ఎన్‌ఎంయు జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆర్టీసీలో గత నాలుగు సంవత్సరాల నుంచి ఏ క్యాడరర్ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వలేదన్నారు. 2017 పే స్కేల్ అరియర్స్ మిగిలిన సిబ్బంది కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగభద్రతా సర్క్యులర్ అమలు చేయాలన్నారు. సిబ్బందికి ఈహెచ్‌ఎస్ వల్ల సరైన వైద్యం అందుబాటులో లేదన్నారు. సంస్థపరంగా ఉన్న వైద్యవిధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.వినోద్‌బాబు, జిల్లా కార్యదర్శి పిఎస్.ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక : ఆర్టీసీ–1డిపో ఎన్‌ఎంయు డిపో నూతన అధ్యక్షులుగా వి.వి.రమణ, కార్యదర్శిగా కె.రెడ్డిబాషాలను ఎన్నుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను వ్యతిరేకించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు



అనిబిసెంట్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు.

మదనపల్లె : రైతు, కార్మిక, పేదలను దగా చేస్తున్న కేంద్రప్రభుత్వ బడ్జెట్ ను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని అనిబిసెంట్ సర్కిల్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు, వ్యవసాయ, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన రాస్తారోకో చేపట్టారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్, లేబర్‌కోడ్లను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా...సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను దగా చేసేదిగా ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి భారీగా కోతలు విధించారని, దీని వలన వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 42 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి పెట్టుబడిదారులకు ఊడిగం చేసే నాలుగు కోడ్‌లు తెచ్చిందని అన్నారు. ప్రజలందరూ కేంద్ర దగాకోరు బడ్జెట్‌ను, కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్ లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి. ప్రభాకర్ రెడ్డి, బికెఎంయూ జిల్లా కార్యదర్శి తోపుకృష్ణప్ప, ఐటీయూసీ నాయకులు కృష్ణమూర్తి, సీఐటీయూ నాయకులు నారాయణ, పవన్, రాజశేఖర్, రెడ్డిప్రసాద్, చాంద్ బాషా, రామకృష్ణ, చలపతి నాయుడు, రాజు, ఏఐటీయూసీ నాయకులు తిరుమల, ముబారక్, నాగరాజు, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్స్‌కు కనీసవేతనాలు ఇవ్వాలి

కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో వ్యవసాయరంగం, ఉపాధి హామీ కార్మికులకు చేసిన ద్రోహానికి నిరసిస్తూ, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో బుధవారం పోస్టఆఫీస్ ఎదుట నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి మధురవాణి, వీఓఏ జిల్లా అధ్యక్షురాలు రాణి, సుమతి, సీఐటీయూ ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ నాగవేణి

పీలేరురూరల్ : ఆధునిక జీవనశైలి కారణంగా పెరుగుతున్న మరణాలకు గుండెపోటు ఓ కారణమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ గుండెపోటుపై అవహన కలిగి ఉండాలని స్టెమి నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగవేణి అన్నారు. బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గుండెపోటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛాతినొప్పి, ఎడమభుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహకోల్పోవడం వంటి లక్షణాలు కన్పిస్తే గుండెపోటుగా అనుమానించి సమీప ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించాలన్నారు. మొదటి గంటలోపు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి అత్యంత రూ. 45 వేలు ఖరీదైన టెనెక్టెప్లెస్ ఇంజెక్షన్ ఉచితంగా ఇచ్చి ప్రాణాలు కాపాడుతున్నట్లు తెలిపారు. 2022 ఫిబ్రవరి 12 నుంచి పీలేరు ప్రభుత్వాస్పత్రిలో టెనెక్టెప్లెస్ ఇంజెక్షన్ ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 24 మంది ఈ ఇంజెక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడినట్లు చెప్పారు. గుండె పోటు వచ్చిన వారు సకాలంలో ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలని కోరారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్‌ఎంఓ కె.వి. సరస్వతి, ఏవో భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.